# కాగితపు మంటలు

**—వసుంధర**

అతడు నాకు స్నేహితుడే కానీ-ఆ విషయం చెప్పుకునేందుకు ఒకోసారి గర్వంగా ఉండేది, ఒకోసారి భయంగా ఉండేది.

అతడు నాకంటే రెండేళ్ళు పెద్ద.

ఒకోసారి అతడిని కాలేజీలోంచి సస్పెండ్ చేస్తుండే వారు. ఒకోసారి ఊళ్ళో అతడికి సన్మానాలు జరిగేవి.

కొంతమంది మనుషుల్ని తమ అభిరుచుల్ని బట్టి గౌరవిస్తారు, చాలా మంది మనుషుల్ని ప్రజాభిప్రాయం ప్రకారం గౌరవిస్తారు. నేను చాలా మందిలో ఒకడిని. అందువల్ల అతడంటే నా అభిప్రాయాలు తరచు మారుతుండేవి. అతడెప్పుడూ ఒకే విధంగా ఉండేవాడు.

అతడి పేరు గోపి.

అతడీ వ్యవస్థను చూసి ఆందోళన చెందుతున్న వ్యక్తి. తన ఆందోళనను తనలోనే ఇముడ్చు కోలేక-పదిమందినీ ఆవేశపరిచి అన్యాయానికి ఎదురు తిరిగేలా చేస్తుంటాడు. కాలేజీ నుంచి సస్పెండయినా, ఊళ్ళో సన్మానాలు జరిగినా ఇదొక్కటే కారణం.

అతడు నాకు స్నేహితుడు. మా అభిరుచులు, అభిప్రాయాలు కలవడం వల్ల మేము స్నేహితులం కాలేదు. ఇద్దరం పక్కపక్క ఇళ్ళ వాళ్ళం చిన్నప్పట్నుంచీ కలసి ఆడుకున్నాం.

నాకు వయసు పెరుగుతోంది. మనసు పెరగడం లేదు. గోపి మానసికంగా వయసును మించి ఎదిగాడు. అతడికి చదువంటే ఇష్టం లేదు. గ్రాడ్యుయేట్ కావడం ఇష్టం లేదు. మనిషిలోని సృజనాత్మక, పరిశీలనాత్మక దృష్టిని చదువు చంపేస్తుందని అనేవాడు. కానీ మొత్తం మీద బియ్యేలో చేరాడు.

బియ్యేలో అతడు నాకో సంవత్సరం సీనియర్.

నేనతడి స్నేహితుడిగా ఉండేవాడిని కానీ అనుచరుడిగా ఉండే వాడిని కాదు. అందువల్ల కాలేజీలో చెడ్డ



పేరు రాకుండా నన్ను నేను కాపాడుకో గలిగాను.

అతడు నాతో ఎన్నోసార్లు అన్నాడు- "ఏ దేశంలోనైనా మార్పు రావాలంటే యువతరం ఎదురు తిరగాలి. ఆ ఎదురు తిరగడంలో కొన్ని త్యాగాలు కూడా చేయాల్సి ఉన్నా సందేహించకూడదు. అందు

వల్ల ముందు తరాలు సుఖపడ తాయి. బ్రిటిష్ వారి పరిపాలనలో యువతరం చేసిన త్యాగాలే ఇప్పుడు మనని స్వతంత్ర భారత పౌరుడిని చేశాయి. మనం ఈ వ్యవస్థని మార్చే విప్లవం తీసుకరావాలి.''

అతడి ఉద్దేశ్యం నా కర్థమయింది.

దేశంలో అవినీతి ప్రత్యక్ష విహారం చేస్తోంది. అవినీతి ఎక్కడి కక్కడ కొనసాగుతున్నదని దేశంలోని ప్రతి పౌరుడికీ తెలుసు. పాలక వర్గానికీ తెలుసు. కానీ పాలక వర్గం అవినీతి నిరోధక చర్య లంటూ ప్రకటనలు మాత్రం చేస్తోంది. పౌరుడు అవినీతికి గురవుతున్నానంటూ బాధ పడతాడు. ఈ పరిస్థితి ఎన్నాళ్ళు? ఎవరూ పూనుకోక పోతే దీనికి అంతం లేదు.

బియ్యే సెకండియర్లో కాబోలు గోపి తన అనుచరులతో ఓ బ్లాక్ మార్కెటీర్ ఇంటి మీద దాడి చేశాడు. బ్లాక్ మార్కెటీర్ పోలీసుల సహాయం కోరాడు. ఆ తర్వాత ఏం జరిగిందో గోపి అరెస్టయ్యాడు. బ్లాక్ మార్కెటీర్ మామూలుగా ఉన్నాడు.

తెలివి తక్కువ తనంగా అతను తన జీవితాన్ని నాశనం చేసుకున్నాడని మా యింట్లో అంతా చెప్పుకునేవారు.

నిజానికి నా కతడి ఆశయాలు నచ్చేవి. అతడి అనుచరుడినై పోవాలన్నంత ఆవేశమూ కలిగేది. కానీ అందువల్ల నా సుఖజీవనం దెబ్బ తింటుందని భయం.

మూడు నెలల అనంతరం గోపి జైలునుంచి తిరిగి వచ్చాడు. తను చేసిన తప్పునపుడు గ్రహిస్తాడనే అనుకున్నాను.

గోపి నన్ను కలుసుకొని- ''నా తప్పు గ్రహించాను. ఈ వ్యవస్థను ఎదురు దెబ్బ తీయడం అసాధ్యం. దీన్ని చాటు దెబ్బ తీయాలి. నేను ఫలానా అని చెప్పకుండా మామూలు జీవితం గడుపుతూ ఉద్యమం నడపాలి'' అన్నాడు.

అతడు కాలేజీలో బియ్యే కొనసాగించాడు. రహస్యంగా అవినీతిపై పోరాటమూ కొనసాగించాడు. అతడి ముఠా పేరు ''ప్రజాశక్తి.'' ప్రజాశక్తికి మంచి పేరు వచ్చింది. అది అవినీతికి పక్కలో బల్లెమై కూర్చుంది. ప్రజాశక్తికి నాయకుడు గోపి అన్న విషయం ఎవరూ

తెలుసుకొనలేక పోతున్నారు. నాకు ప్రజాశక్తిలో చేరిపోవాలనే ఆవేశం కలిగినా దాన్నణచుకునే వాడిని.

నా బియ్యే అయిపోయింది. ఉద్యోగాల వేటలో పడ్డాను.

అంతకాలం- కష్టపడి చదువుకుంటే చాలనుకునే వాడిని. ఇప్పుడు - ఆ చదువెందుకూ అనిపిస్తోంది.

ఎంప్లాయిమెంట్ ఎక్చేంజీలో నా ముందు ఎందరో ఉన్నారు. మామూలుగా అప్లయి చేసే చోట ఇంటర్వ్యూ రావడమే గగనంగా ఉన్నది. వచ్చినచోట ఒక్క పోస్టుకి లెక్కకు మించిన అభ్యర్థులు.

బియ్యే ప్యాసై ఒకటి... రెండు... మూడు సంవత్సరాలు గడిచాయి. నాకెక్కడా ఉద్యోగావకాశాలు కనపడ్డం లేదు.

అప్పటికి నాకు ఈ వ్యవస్థ అర్థం కాసాగింది.

ఉద్యోగం కావాలంటే డబ్బు కానీ పలుకుబడి గానీ ఉండాలి. ఈ రెండు ఉన్నాక అదృష్టం కలిసి రావాలి. చదివిన చదువు ఉద్యోగం కోసం ఎదురు చూడమంటుంది తప్పితే తన కాళ్ళమీద తను నిలబడే శక్తి నివ్వదు.

అవినీతి... ఎక్కడ చూసినా అవినీతి... నా కళ్ళముందే అవినీతి. ఈ వ్యవస్థకు నేను ఎదురు తిరగాలి....

'అయ్యోగోపీ! ఇంతకాలానికి నేనర్థం చేసుకున్న విషయాన్ని నువ్వెంతో ముందే తెలుసుకున్నావు గదా!' అని బాధపడ్డాను.

కానీ ఇప్పుడు గోపీని పట్టుకొనడం కష్టం. అతడి మీద ప్రభుత్వానికి అనుమానం రానే వచ్చింది.

గోపీ పోలీసులకు దొరక్కుండా తిరుగుతున్నాడు. అతడి నిప్పుడు నక్సలైట్ అని చాలామంది చెప్పుకుంటున్నారు.

నాకూ నక్సలైట్ని కావాలనుంది. ఈ పోరాటంలో నేనేమైనా ఫర్వాలేదు- నా ముందు తరాలు సుఖపడితే అదే చాలు!

నేను గోపీ కోసం వెతుకుతున్నాను. నా చుట్టూ ఉన్న వ్యవస్థ నా రక్తం మరిగింపజేస్తోంది. గుండెను మండిస్తోంది. ఇంక నేను ఆగలేను.

ఆ రోజు గోపీ వస్తాడని తెలిసి రాత్రి మెలకువగా ఉన్నాను.

గోపీ మాయింటికి వస్తాడు. అతని తల్లి తండ్రులు మాయింటికి వచ్చి

కలుసుకుంటారు. తెల్లవారేసరికల్లా అతను వెళ్ళి పోతాడు. అతడితో పాటు కలిసి నేనూ వెళ్ళిపోవాలి. ఈ నిర్ణయం ముందుగా నా తల్లి తండ్రులకు కూడా చెప్పకూడదు. చెబితే వారంగీకరించరు.

నా మనసెంతో సంతోషంగా ఉంది. నేను ఈ వ్యవస్థను ఎదిరి స్తాను. ఇప్పుడింక ఉద్యోగం వచ్చినా చెయ్యను.

రాత్రి తొమ్మిదింటికి గోపీ రావాలి. పొరుగూరెళ్ళిన నాన్న గారు రాత్రి ఎనిమిదింటికి వచ్చారు. ఆయనెంతో ఉత్సాహంగా ఉన్నారు. నన్ను ఆప్యాయంగా బాబీ అని పిలిచారు. ఆఫీసు పని మీద ఆయన పొరు గూరు వెళ్ళారు. అక్కడ నాకో పెళ్ళి సంబంధం వచ్చింది. ఉద్యో గం మామగారే వేయిస్తాడట. సం ప్రదాయంగల కుటుంబం కోసం చూస్తున్నాడట.

నేను మనసులో నవ్వుకున్నాను. నా నిర్ణయం గురించి నాన్నగారికి తెలియదు. నేను నక్సలైట్‌ని కాబో తున్నాను. నాకింక ఉద్యోగా లెందుకు?

నాన్నగారు ఉద్యోగం గురించి వివ రిస్తున్నారు. నెలకు ఎనిమిదివందలు జీతం. కాబోయే అల్లుడి కోసం ఏడాదినుంచి ఆయనా ఉద్యోగం ఫిలప్ కాకుండా అలా ఆకట్టి ఉంచు తున్నాడట. ఆయన నా గురించి చాలా మంచిగా విన్నాడట.

ఎంత దారుణం? స్వార్థం కోసం ఓ ఉద్యోగాన్ని అలా ఉంచేశాడా? ఇదే- ఈ వ్యవస్థనే నేనెదుర్కో వాల్సింది.

నాన్నగారు నా అదృష్టానికి సంతోష పడుతున్నారు. తనకు ఆసరాగా ఓ చెయ్యి వస్తుందని సంతోషపడు తున్నారు.

ఆ శుభ సందర్భంలో నా తమ్ముడు, నా చెల్లి పాత చిత్తు కాగితాలతో దొడ్లో చలిమంట వేస్తూ మమ్మ ల్నందర్నీ పిలిచారు.
మంట దగ్గర తమ్ముడు కూర్చుని ఓ కథ చెపుతున్నాడు.

అనగా అనగా ఓ తోడేలు. అది వరదలో కొట్టుకు పోతూ ఓ చిన్న గుట్టలాంటిది కనపడితే దాని మీద చేరింది. ఎక్కడా ఆహారం దొరికే అవకాశంలేదు, 'పోనీలే ఈ రోజు ఏదకాశికదా-ఉపవాసముందాం' అను కుంది తోడేలు. అదే సమయానికి నీటిలో కొట్టుకుపోతూ ఓ మేకపిల్ల ఆ గుట్టమీదకు చేరబోయింది,

'ఇక్కడ చూస్తే మళ్ళీ ఆహారం దొరికే అవకాశం లేదు. ముందీ రోజు సంగతి చూస్తే- మరో ఏకాదశికి ఉపవాసం ఉండవచ్చు' అనుకొని తోడేలు ఆ మేక పిల్ల మీద దూకబోయింది. తోడేలును చూస్తూనే ఆ మేక పిల్ల చచ్చే చావేదో నీటిలోనే చూసుకోవచ్చు ననుకుని తిరిగి ప్రవాహంలోకి దూకేసింది. అప్పుడు తోడేలు- 'ఇంకా నయం, ఏకాదశి ఉపవాసం పాడు చేసుకుందును' అని తృప్తి పడింది.

కాగితం మంట ఆరిపోయింది. కథ అయిపోయింది.

'వెధవది- ఎన్ని కాగితాలేసినా ఇట్టే మండి పోతాయి. పట్టుమని పది నిమిషాలు కూడా వెలగవు' అని విసుక్కుంది చెల్లి.

'కాగితం మంట అంతేనమ్మా!' అన్నారు నాన్నగారు చెల్లితో.

ఉన్నట్లుండి నాకు నిద్ర ముంచుకు రాసాగింది.

వెళ్ళి పడుకున్నాను.

నాకు ఎంత గాఢంగా నిద్ర పట్టిందంటే, ఆ రాత్రి గోపీని కలుసుకుని మాట్లాడ లేకపోయాను.

అదే మంచిదయింది.

లేని పక్షంలో నేనూ అతడిలా, అడవుల్లోనూ, కొండల్లోనూ తిరుగుతూ పోలీసులకు భయపడుతూ ఉండ వలసొచ్చేది.

ఈ వ్యవస్థ గురించి నా కిప్పుడు బాధ లేదు. నేనూ అందులో ఒక భాగాన్ని!

నాన్నగారుద్యోగం వార్త ఓ గంట ఆలస్యంగా తెస్తే ఏమయిపోయి వుండే వాడినో-తల్చుకున్నప్పుడల్లా మాత్రం నా శరీరం గగుర్పొడుస్తూంటుంది. *

---

మాంచాలను కొలుస్తారు, మల్లమ్మను తలుస్తారు
ఝాన్సీలక్ష్మిబాయికి బాష్పధార విడుస్తారు
సరోజినీదేవి ఫొటో పటంకట్టి పొగుడుతారు
పంచాది నిర్మలంటే భయంపుట్టి వొణుకుతారు.
తెల్లవాడు నిన్ను నాడు భగస్సింగు అన్నాడు
నల్లవాడు నువ్వు నేడు నక్సలైటు వన్నాడు
ఎల్లవారు నిన్ను రేపు వేగుచుక్క అంటారు.